నేటి దినపత్రిక
సూర్య
www.suryaa.com
నిజామాబాద్ కామారెడ్డి
ఆదివారం 30 మార్చి 2025 5 పేజీలు

# తెలుగు వారి ప్రకృతి పండుగా.. వెలుగులు నింపే ఉగాది వేడుక

## - నేడు తెలుగు సంవత్సరాది (శ్రీ విశ్వావసు నామ) ఉగాది వేడుకలు

**సూర్య కామారెడ్డి జిల్లా ప్రతినిధి**

తెలుగు సంవత్సరాది ఉగాది..జీవన రాగాన్ని ఆలపించే కోయిల గానాలు..మమతల పరిమ ళాలు పంచే ఆహ్లాదకరమైన వాతావరణం. .కష్టాల వడగాల్పులకు చలించక చైత్రంలో తరవుల్లా స్థిరంగా నిలవడం లక్ష్యంగా సాగే జీవన పయనం.. ఒక్కోసారి ఆశల ఆకులు రాలిన మళ్లీ చిగురు తొడుగుతుందనే ధీమా,నవ జీవితానికి అదే నాంది మరెన్నో యుగాలకు ఆరంభ పండగ,అదే నేడు ఉగాది... చైత్రమాసంలో ప్రకృతి సప్తవర్ణ శోభితం అవుతుంది. మోడు వారిన తనువులు చిగురాకుల చీరలు కట్టి, హొయలు పోతాయి..మూగబోయిన కోయిల గొంతు సవరించుకుని కిలకిల రాగాలు పలికిస్తుంది. పల్లెవాలు సోయగాలు పోతే,మల్లెలు మధుర పరిమళాలు వెదజల్లుతాయి.ఎటు చూసినా ఆనందాలు, ఆహ్లాదంతో పల్లెలన్నీ పరవశించి పోతాయి నేడు. చైత్రమాసమును మధుమాసం గాను పిలుస్తారు,మధువు అనగా తేనె.జీవితం తేనెలా అమృత తుల్యం కావాలన్నదే ఉగాది ఆంతర్యం.





**- ఉగాది..హిందూ పండుగలా ఆరంభ నాంది**

ఉగాది హిందూ నూతన సంవత్సర ప్రారంభాన్ని సూచిస్తుంది మరియు భారతదేశంలోని ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక మరియు గోవాలో జరుపుకుంటారు.యుగాది లేదా ఉగాది అనే పదాలు 'యుగం' (యుగం) మరియు 'ఆది' (ప్రారంభం) అనే సంస్కృత పదాల నుండి ఉద్భవించాయి, ఇది 'నూతన యుగం ప్రారంభం' అని సూచిస్తుంది. సాధారణంగా గ్రెగోరియన్ క్యాలెండర్‌లో మార్చి చివరిలో లేదా ఏప్రిల్ ప్రారంభంలో వచ్చే ఈ రోజు హిందు వులకు చారిత్రక మరియు సాంస్కృతిక ప్రాముఖ్యతను కలిగి ఉంది.మహారాష్ట్రలో గుడి పడ్వ, ఆంధ్రప్రదేశ్,తెలంగాణలో ఉగాది, కర్ణాటకలో యుగాది వంటి వివిధ పేర్లతో జరుపుకుంటారు.ఇది అనాదిగా గౌరవించబడిన సంప్రదాయం.ఈ రోజున సంప్రదాయాలలో ముగ్గులు లేదా రంగోలి వంటి రంగురంగుల (మిగతా 2లో)






# బెల్టు' తీయండి సారు......

**సూర్య వేల్పూర్**

వేల్పూర్ మండలంలోని పెద్ద గ్రామ పంచాయతీలలో వైన్ షాపులను టెండర్ ద్వారా దక్కించుకున్న వైన్స్ యజమానుల నుండి గ్రామాల్లోని మద్యం విక్రయాల కోసం బెల్ట్ షాపు ఏర్పాటు చేసుకొని దందా కొనసాగించడం అనేది తీవ్ర ఆందోళన గురిచేస్తోంది. బెల్ట్ షాపులు మైనర్ గ్రామ పంచాయతీలలో ప్రతి గ్రామాలలో ఉన్న దృష్ట్యా ప్రభుత్వ ఆదాయానికి వనరుగా మారిందని చెప్పవచ్చు. బెల్ట్ షాపుల నిర్వాహకులు మద్యం అమ్మకాలను ఎమ్మార్పీ రేటు కంటే ఎక్కువ రేట్లకు ఇస్తున్నారు. అలాగే బెల్టు షాపుల వద్ద ఆరు బయటనే మద్యం సేవించి నానా హంగామా చేయడంతో గ్రామాల్లోని మహిళలు రోడ్ల పైన తిరగడానికి జంకుతున్నారు. బెల్టు షాపుల నిర్వహణ ప్రభుత్వం దృష్టిలో తప్పని తెలిసినప్పటికీ ప్రభుత్వ ఆదాయం కోసం బెల్ట్ షాపుల నిర్వహణ కొనసాగించమని చెప్పకనే చెబుతున్నట్లుగా వ్యవహరిస్తున్నారనేది ప్రజల యొక్క అభిప్రాయం. బెల్ట్ షాపుల వద్ద నిర్వాహకులు ఇష్టం వచ్చినట్లుగా వ్యవహరించడం ఆరు బయట మద్యం సేవించడానికి అనుమతులు ఇవ్వడం అక్కడనే విందులు ఏర్పాటు చేయడం ఇలాంటివి చేయడం వల్ల ప్రజలు (మిగతా 2లో)








# తెలుగు వారి ప్రకృతి పండుగా.. వెలుగులు నింపే ఉగాది వేడుక

(మొదటి పేజీ తరువాయి)

పుడమి నమూనాలను సృష్టించడం, తోరణం అని పిలువబడే మామిడి ఆకులతో ఇంటి ద్వారాలను అలంకరించడం,బహుమతులు ఇచ్చిపుచ్చు కోవడం,దాతృత్వం అందించడం,నూనె మసాజ్‌లు,ఉత్సవ స్నానాలలో పాల్గొనడం,పచ్చడి అనే ప్రత్యేక వంటకాన్ని తయారు చేయడం, పంచుకోవడం మరియు హిందూ దేవాలయాలను సందర్శించడం వంటివి ప్రజలు చేస్తారు.ఆరు రుచుల మిశ్రమంతో కూడిన పచ్చడి, తెలుగు, కన్నడ హిందూ ఆచారాల ప్రకారం రాబోయే సంవత్సరంలో జీవితంలోని అన్ని అంశాలను స్వీకరించడాన్ని సూచిస్తుంది.

**- ఆరు రుచుల పచ్చడి..ఆరోగ్యానికి ప్రధానం.**

ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని వేప పువ్వులు, కారం, చింతపండు, మామిడికాయ, బెల్లం మరియు ఉప్పు కలిపి తయారు చేస్తారు. ఉపయోగించిన అన్ని పదార్థాలు జీవితంలోని వివిధ కోణాలను ప్రతిబింబిస్తాయి.పచ్చడి అనేది చాలా ఇళ్లలో తయారుచేసే ఒక ఆచార వంటకం. పచ్చడి కాకుండా,పచ్చడిలో వాడే ప్రతీ పదార్థం ఆరోగ్యానికి మేలు చేకూర్చే వంటకం. హోళిగే, పులియోగురే వంటి వంటకాలను కూడా తయారు చేస్తారు.పండుగలో మరో ముఖ్యమైన అంశం పంచాంగాన్ని వినడం. పూజారులు,జ్యోతిష్కులు లేదా కుటుంబంలోని పెద్ద సభ్యులు చెప్పే రాబోయే సంవత్సరం గురించి సూచన.పంచాంగ శ్రవణం వల్ల రాబోయే కాలాన్ని అనుసరించి,ఆచరించాల్సిన నియమాలు తెలుసుకోవడం,ఆధ్యాత్మిక పరంగా దైవ చింతన అనే భావనను పంచాంగం కల్గిస్తుంది. ఆనందకరమైన పండుగ అయిన ఉగాదిని ప్రజలు శాంతి, ఆనందం మరియు శ్రేయస్సు యొక్క మార్గదర్శిగా చూస్తారు.

# సమాజ సేవలో మనిషి గుర్తింపు పొందిన వ్యక్తి శ్రీనివాస్ రెడ్డి

## - జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్

**సూర్య కామారెడ్డి జిల్లా ప్రతినిధి**

వ్యక్తిత్వం, మంచి నైపుణ్యత, సహాయ గుణం, హార్డ్ వర్క్ చేసే గుణం కలిగిన వ్యక్తి శ్రీనివాస్ రెడ్డి అని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ అన్నారు. శుక్రవారం రాత్రి కలెక్టరేట్ సమావేశ మందిరంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి ఆత్మీయ వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో గత 10 నెలలుగా పనిచేసిన ఆయన మంచి పేరు సంపాదించుకున్నారని, విధులలో నిబద్ధత కలిగిన వ్యక్తి అని అన్నారు. నాయకత్వ లక్షణాలు కలిగి, ప్రతి పనిలో తనదైన శైలిలో విధులు నిర్వరించేవారని అన్నారు. పదవీ విరమణ అనంతరం కుటుంబ సభ్యులతో ఆయురారోగ్యంగ, సామాజిక సేవల్లో పాల్గొనాలని ఆకాక్షించారు. వీడ్కోలు సమావేశం పాల్గొన్న పలు జిల్లాల అదనపు కలెక్టర్లు, ఆర్డీఓ లు, ఆయన బంధువులు,



శ్రేయోభిలాషులు మాట్లాడుతూ, చంద్రుని కైనా మచ్చ ఉంటుంది కావచ్చు గాని, మచ్చ లేకుండా నిర్భయంగా విధులు నిర్వహించేవారని తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశాలు పాటిస్తూ, సకాలంలో బాధ్యతతో పనులు చేసేవారని, క్రింద స్థాయి ఉద్యోగులకు మార్గదర్శకులుగా ఉంటారని తెలిపారు. ఎల్లప్పుడూ మందహాసంతో ఎంతటి పని అయినా అవలీలగా నిర్వర్తించేవారని అభివర్ణించారు. చివరగా శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ, తన విధినిర్వహణలో జరిగిన సంఘటనలు, ఉద్యోగ ప్రస్తానం గురించి వివరించారు. ప్రజల సమస్యలు పరిష్కరిస్తూ, ప్రజా ప్రతినిధుల మన్ననలు పొందానని తెలిపారు. జుక్కల్ నియోజక వర్గంలో ఎన్నికల నిర్వహణ సమయంలోని వివరాలు, ఆ ప్రాంత ఉద్యోగుల పనితనం గురించి వివరించారు. అనంతరం అధికారులు, ఉద్యోగులు, బంధువులు ఆయనను శాలువ,మెమెంటోలు, పూల గుచ్చాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. తొలుత శ్రీనివాస్ రెడ్డి దంపతులకు గజమాల తో సత్కరించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వి.విక్టర్, సబ్ కలెక్టర్ కిరణ్మయి, వివిధ జిల్లాల అదనపు కలెక్టర్లు, ఆర్డీవోలు,జిల్లా అధికారుల సంక్షేమ సంఘం, తెలంగాణ రెవిన్యూ సర్వీస్ అసోసియేషన్, తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం, తెలంగాణ నాన్ గెజిటెడ్ అధికారుల సంఘం, నాల్గవ తరగతి ఉద్యోగుల సంఘం, ఎంపీడీఓ ల సంఘం, తహసీల్దార్లు, పంచాయతీ కార్యదర్శులు, వివిధ సంఘాల ప్రతినిధులు, ఉద్యోగులు, బంధువులు పాల్గొన్నారు.

# రైతులు తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించాలి

**సూర్య -నిజాంసాగర్**

సహకార సంఘం లో తీసుకున్న రుణాలను రైతులు సకాలంలో చెల్లించి సహకార సంఘం అభివృద్ధికి సహకరించాలని మల్లూరు సహకార సంఘం అధ్యక్షురాలు కళ్యాణి విట్టల్ రెడ్డి అన్నారు. శనివారం మల్లూరు సహకార సంఘం ఆవరణలో సహకార సంఘం అధ్యక్షురాలు కళ్యాణి విట్టల్ రెడ్డి అధ్యక్షతన మహాజనసభ జరిగింది. ఈ సమావేశంలో మొదటగా సహకార సంఘానికి సంబంధించిన ఆరు నెలల లావాదేవీల జమాకర్చుల వివరాలను కార్యదర్శి సాయిలు చదివి వినిపించారు. ఈ సమావేశంలో జొన్న పంటలు చేతికి వస్తూ ఉండడంతో జొన్నల కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని ఒక ఎకరానికి 25 క్వింటాళ్ల చొప్పున జొన్నను కొనుగోలు చేయాలని తీర్మానించారు. సంఘ పరిధిలోని వడ్డేపల్లి గ్రామంలో కొనుగోలు కేంద్రాలు ఐకెపి డ్వాక్రా సంఘాలకు కేటాయించడంతో వాటిని తిరిగి సహకార సంఘానికి కేటాయించాలని సభ్యులందరూ



ఏకగ్రీవంగా తీర్మానించారు. రెండు లక్షల లోపు రుణమాఫీని ఏకకాలంలో చేయాలని తీర్మానించారు. సహకార సంఘంలో ప్రభుత్వం కేటాయించిన రుణమాఫీ కటాఫ్ తేదీ 9 12-2023 నాటికి సంగంలో రెండు లక్షల లోపు రుణాలు తీసుకున్న రైతులు1091 మంది అర్హులకు మూడు కోట్ల 69 లక్షల 65 వేల 688 రూపాయలు రావాల్సి ఉండగా అందులో నుండి కేవలం 242 మంది రైతులకు 75 లక్షల 91 వేల 934 రూపాయలు మాత్రమే వచ్చాయి. రుణమాఫీ కానీ 849 మంది రైతులకు రెండు కోట్ల 93 లక్షల 73 వేల 754 రూపాయలు రావాల్సి ఉంది. రుణమాఫీ పూర్తిగా ఎందుకు జరగలేదని రైతులు కార్యదర్శి సాయిలు ను ప్రశ్నించారు అందుకుగాను కార్యదర్శి సాయిలు సమాధానం ఇస్తూ తాము సహకార సంఘం నుండి రైతులకు సంబంధించిన వివరాలను సక్రమంగానే ఎలాంటి తప్పులు లేకుండా పంపించామని అన్నారు. సహకార సంఘాల్లో వాడే ఇంటలెక్ట్ సాఫ్ట్వేర్ కారణంగానే రైతుల పేర్లలో తప్పులు పడ్డాయని ఒకే అకౌంట్ పై వేర్వేరు సొసైటీల రైతుల పేర్లు తప్పుగా పడటంతో రుణమాఫీ జరగలేదని ఆయన అన్నారు ఇంటలెక్ట్ సాఫ్ట్వేర్ కారణంగా పేర్లలో తప్పులు పడి రుణమాఫీ కానీ రెండు లక్షల లోపు అర్హత ఉన్న రైతులకు రుణమాఫీ జరిగేలా చూడాలని రైతులు సంఘ కార్యదర్శి కి సూచించారు. ఈ సమావేశంలో ఉపాధ్యక్షుడు రాంసింగ్, డైరెక్టర్లు విట్టల్ రెడ్డి, వెంకటరామిరెడ్డి, సాయిలు, బంజపల్లి నర్సింలు, సాతల్లి అంజయ్య, భూమేష్, బుడిమి గంగారం నాయకులు కృష్ణారెడ్డి, హనుమంత్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ రాజారామ్, బుడిమి శ్రీనివాస్, షేక్ హైమద్, సంఘ పరిధిలోని రైతులు, సిబ్బంది విటల్, రాజు, సత్యనారాయణ పాల్గొన్నారు.

# మాచారెడ్డి పోలీస్ స్టేషన్ ను సందర్శించిన అడిషనల్ ఎస్పీ చైతన్య రెడ్డి

**సూర్య కామారెడ్డి టౌన్**

కామారెడ్డి ఎఎస్పి చైతన్య రెడ్డి మాచారెడ్డి పోలీస్ స్టేషన్ ని సందర్శించడం జరిగింది. పోలీస్ స్టేషన్ నందు ఉన్నటువంటి పలు రికార్డులను చెక్ చేయడం జరిగింది. అదేవిధంగా పోలీస్ స్టేషన్ నందు నమోదైన కేసుల వివరాలను అడిగి తెలుసుకుని తగు సూచనలు చేయడం జరిగింది. అదేవిధంగా పోలీస్ స్టేషన్ సిబ్బందికి సూచనలు చేయడం జరిగింది. పోలీస్ స్టేషన్ పరిసరాలను పరిశీలించడం జరిగింది. పలు గ్రామాల నుండి వచ్చే ఫిర్యాదుదారులకు తగిన న్యాయం చేసే విధంగా పోలీసులు సహకరించాలని ఆమె సూచించారు. పోలీస్ స్టేషన్కు వచ్చే ఫిర్యాదుదారులతో ఫ్రెండ్లీ పోలీసింగ్ విధానాన్ని అవలంబించారని అన్నారు. ఈ కార్యక్రమంలో కామారెడ్డి రూరల్ సి ఐ రామన్ మాచారెడ్డి ఎస్ఐ అనిల్ మాచారెడ్డి పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.




# బెల్టు' తీయండి సారు...

(మొదటి పేజీ తరువాయి)

ఇబ్బందులకు గురవుతున్న విషయం సంబంధిత శాఖకు ఎలాంటి పట్టింపు లేకుండా వ్యవహరిస్తున్నారనేది ప్రశ్నగా మిగిలిపోయింది. బెల్ట్ షాపు నిర్వాహకులపై ఇంతవరకు ఎక్సైజ్ అధికారులు దాడులు చేసిన దాఖలాలు కూడా లేవు. గ్రామాలలో బెల్ట్ షాపుల నిర్వహణను కొనసాగించమని ఎక్సైజ్ అధికారులు ప్రోత్సహించి వారి వద్ద మామూలు తీసుకుంటూ మూడు పువ్వులు ఆరు కాయలుగా నడవాలని కోరుకుంటున్నాట్లు గా ఉందని ఆరోపిస్తున్నారు. అదేవిధంగా వైన్స్ షాపు నుంచి తెచ్చిన మద్యాన్ని కల్తీ చేయరనేది గ్యారెంటీ ఏముందని ఉన్నతమైన లిక్కర్లలో చీఫ్ లిక్కర్ కలిపి అమ్మకాలు కొనసాగించడం దారుణమైన విషయమని ఇది ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడడం అంటున్నారు. బెల్ట్ షాపుల వద్ద మద్యం సేవించడం ఒక తప్పు అయితే వైన్ షాపుల ముందు కూడా మద్యం సేవించడం అనేది చాలా దుర్మార్గమైన విషయం, ఎలాంటి పర్మిషన్లు లేకుండానే బెల్ట్ షాప్ లో నిర్వహించడం చాలా దారుణమైన విషయమని ప్రజలు ఆరోపిస్తున్నారు. ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్న ఈ బెల్ట్ షాప్ మహమ్మారి లను తొలగించాలని బెల్టుషాపు నిర్వహణ కొరకు టెండర్ వేయడం కూడా జరుగుతుండటం ప్రభుత్వానికి మచ్చా అనే చెప్పవచ్చు.

## టేక్రియాల్ లో పెట్రోల్ పంపును ప్రారంభించిన షబ్బీర్ అలీ

**సూర్య కామారెడ్డి టౌన్**



కామారెడ్డి పట్టణంలోని 13 వార్డు టేక్రియాల్ లో ప్రభుత్వ సలహా దారు ముహమ్మద్ అలీ షబ్బీర్ హిందుస్థాన్ పెట్రోలియం .పెట్రోల్ పంప్ ను ప్రారంభించారు. అనంతరం టేక్రియాల్ చౌరస్తా పెట్రోల్ పంప్ లో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందుకు హాజరై ప్రత్యేక ప్రార్ధనలు చేశారు. ఈ సందర్భంగా షబ్బీర్ ఆలీ మాట్లాడుతూ కామారెడ్డి పట్టణం టెక్రియల్ లో పెట్రోల్ పంప్ ప్రారంభించడం ప్రజలకు రైతులకు అందుబాటులో ఉంటుందన్నా పవిత్ర రంజాన్ మాసం ఇఫ్తార్ లో పాల్గొనడం చాలా ఆనందంగా వుంది ముస్లిం సోదర సోదరీమణులకు రంజాన్ మాసం శుభాకాంక్షలు తెలియజేశారు. తమ ప్రభుత్వం మైనారిటీల అభివృద్ధికి కృషి చేస్తుందని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్యోగుల నిరుద్యోగులు సహకారంతో అధికారంలోకి వచ్చింది రాజీవ్ యువవికాసం పథకాన్ని అందరు సద్వినియోగం చేసుకోవాలన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్ని రంగాల్లోనూ తెలంగాణలో పురోగమించేలా, దేశంలోనే అగ్రరాజ్యంగా ఆవిర్భవించాలని కోరుతూ పవిత్ర రంజాన్ మాసంలో ప్రత్యేకంగా ప్రార్థనలు చేయాలని ఆయన ముస్లిం సామాజిక వర్గానికి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మైనార్టీ నాయకులు పాల్గొన్నారు.

## ర్యాగట్లపల్లిలో సిసి రోడ్లు నిర్మాణ పనులు ప్రారంభం

**సూర్య- బిక్కనూర్**



మండలంలోని ర్యాగట్లపల్లిలో శనివారం ఎన్ఆర్ఈజీఎస్ నిధుల కింద మంజూరైన ఐదు లక్షల రూపాయలతో నూతనంగా నిర్మించనున్న సిసి రోడ్డు నిర్మాణ పనులను జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మద్ది చంద్రకాంత్ రెడ్డి, టిపిసిసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బద్దం ఇంద్రకరణ్ రెడ్డి లు కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ సహకారంతో మండలాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయిస తున్నట్లు, ఇందులో భాగంగా గ్రామానికి మంజూరు అయిన ఐదు లక్షల రూపాయల నిధులతో సిసి రోడ్డు నిర్మాణ పనులు చేపట్టినట్లు వారు వివరించారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బాల్యాల సుదర్శన్, మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీరామ్ వెంకటేష్, పార్టీ సీనియర్ నాయకులు నరేందర్ రెడ్డి, మల్లారెడ్డి గ్రామ పార్టీ నాయకులు పాల్గొన్నారు

## పాఠశాలలో ముందస్తు ఉగాది సంబరాలు..

**సూర్య- నవీపేట్**




పాఠశాల శివతాండ లో శ్రీ విశ్వవసు నామ సంవత్సర ఉగాది సంబరాలను ముందస్తుగా ఘనంగా నిర్వహించారు. విద్యార్థులకు ఉగాది పండుగ ప్రాముఖ్యతను వివరిస్తూ వారి చేత పంచాంగ శ్రవణం, కొత్త సంవత్సర, రాశుల ఫలితాల గురించి ప్రధానోపాధ్యాయులు శివకుమార్ క్లుప్తంగా వివరించారు. తరగతుల వారీగా విద్యార్థులకు తెలుగు పద్యాలు, తెలుగు సంవత్సరాలు, నెలల గురించి పోటీలు నిర్వహించారు. షడ్రుచుల ఉగాది పచ్చడి తయారు చేసి విద్యార్థులకు అందజేశారు. విద్యార్థుల చేత సంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రాజు, మమత, పావని, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# ఢిల్లీలో పాపన్న మహారాజ్ నినాదం మారుమ్రోగాలి

## - ఢిల్లీకి భారీ ఎత్తున గౌడ సోదరులు తరలిరావాలి

## - జై గౌడ ఉద్యమం కామారెడ్డి జిల్లా అధ్యక్షుడు రంగోల్ల మురళి గౌడ్

**సూర్య కామారెడ్డి జిల్లా ప్రతినిధి**

దేశవ్యాప్తంగా ఉన్న గౌడులను ఒక తాటిపైకి తెచ్చి వారందరి నోట పాపన్న మహారాజ్ చరిత్రను ప్రచారం చేయించే బృహత్తరమైన బాధ్యత మనందరిదని తెలియజేయడం కోసమే ఈ "పాపన్న మహారాజ్ ఆత్మ బలిదాన దినోత్సవం"కార్యక్రమామని జై గౌడ ఉద్యమం జిల్లా అధ్యక్షుడు రంగోల్ల మురళి గౌడ్ అన్నారు. ఢిల్లీలో ఏప్రిల్ రెండవ తేదీన కాన్స్టిట్యూషన్ క్లబ్ లో జరిగే కార్యక్రమానికి భారీ ఎత్తున గౌడ సోదరులు తరలిరావాలని పిలుపునిచ్చారు. కామారెడ్డి పట్టణంలోని జై గౌడ ఉద్యమం కార్యాలయంలో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు.మనం నిత్యజీవితంలో ఎన్నో ఖర్చులు పెట్టి బర్త్డే లు, మ్యారేజ్ డే లు, ఫంక్షన్లో నిర్వహించుకుంటాం. ఖర్చుకు భయ



పడం. అలాగే గౌడ జాతి ఆత్మ గౌరవాన్ని ప్రపంచానికి తెలియజేసిన సర్దార్ పాపన్న మహారాజ్ నినాదం ఢిల్లీలో మారుమరోగించడానికి ఖర్చుకు వెనకాడకుండా దేశవ్యాప్తంగా ఉన్న గౌడులంతా తరలిరావాలని పిలుపునిచ్చారు. చాలామంది పాపన్న గురించి మనకెందుకులే అని నిర్లక్ష్య వహించే వాళ్ళు కూడా ఉన్నారన్నారు.పాపన్న లేకుంటే గౌడ సమాజానికి గౌరవం లేదన్నారు.పాపన్న లేకుంటే భవిష్యత్తు లేదన్నారు.పాపన్న మహారాజ్ వారసులమని చెప్పేందుకు గర్వపడాలన్నారు.పాపన్న రక్తం గౌడులలో అనువణువునా ఉప్పొంగాలనీ కోరారు. దేశవ్యాప్తంగా ఉన్న గౌడులంతా జై పాపన్న మహారాజు అనే నినదిస్తుంటే తెలుగు రాష్ట్రాల్లో ఉన్న గౌడ బిడ్డలు ఆనందంతో నృత్యం చెయ్యాలన్నరు.అటువంటి రోజు కోసం ఈరోజు నుండే మొదటి అడుగు ప్రారంభించలన్నారు. పాపన్న మహారాజ్ మరణించలేదని, దేశవ్యా ప్తంగా ఉన్న గౌడుల గుండెల్లో సజీవంగా ఉండేలా చేసే ఈ ప్రయత్నానికి గౌడ బిడ్డలందరూ సహకరించి తండోపతండాలుగా కదిలి ఢిల్లీకి రావాలని జై గౌడ్ ఉద్యమం తరుపున పిలుపునిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో జై గౌడ ఉద్యమం ప్రధాన కార్యదర్శి అంకన్న గారి శ్రీనివాస్ గౌడ్, నాయకులు ఇందూరి సిద్ధ గౌడ్ లు పాల్గొన్నారు.

# మత్స్య కార్మికుల అభివృద్ధికి కృషి చేస్తా

## -జిల్లా మత్స్య పారిశ్రామిక సహకార సంఘం జిల్లా అధ్యక్షులు గాదం సత్యనారాయణ

**సూర్య కామారెడ్డి జిల్లా ప్రతినిధి**

మత్స్య కార్మికుల సంఘం ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో మత్స్య పారిశ్రామిక సంఘం జిల్లా అధ్యక్షులు గాదం సత్యనారాయణ మాట్లాడుతూ మత్స్య కార్మికుల అభివృద్ధికి కృషి చేస్తానని ఈ సందర్భంగా ఆయన హామీ ఇచ్చారు. పద్మశాలి భవన్ కామారెడ్డి లో జిల్లా మత్స్య పారిశ్రామిక సహకార సంఘం జిల్లా అధ్యక్షుడు గాదం సత్యనారాయణ గారి అధ్యక్షతన జరిగిన మత్స్యకార సహకార సంఘం జిల్లా సర్వసభ్య సమావేశము 11 అంశములతో కూడిన ఎజెండా చర్చలు జరిపి సమావేశాన్ని విజయవంతం చేశారు. కామారెడ్డి జిల్లా మత్స్య శాఖ అధికారి శ్రీపతి గారు జిల్లా మత్స్యకార మత్స్య



పారిశ్రామిక సహకార సంఘం అధ్యక్షులు గాదం లక్ష్మీనారాయణ మేనేజింగ్ డైరెక్టర్ కే డోలి సింగ్, సిబ్బంది దశరథ్, నేడు పద్మశాలి భవన్ కామారెడ్డి లో జిల్లా మత్స్య పారిశ్రామిక సహకార సంఘం జిల్లా అధ్యక్షుడు గాదం సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన మత్స్యకార సహకార సంఘం జిల్లా సర్వసభ్య సమావేశము 11 అంశములతో కూడిన ఎజెండా చర్చలు జరిపి సమావేశాన్ని విజయవంతం చేశారు. ఇట్టి సమావేశంలో కామారెడ్డి జిల్లా మత్స్య శాఖ అధికారి శ్రీపతి జిల్లా మత్స్యకార మత్స్య పారిశ్రా మిక సహకార సంఘం అధ్యక్షులు గాదం లక్ష్మీనారాయణ మేనేజింగ్ డైరెక్టర్ కే డోలి సింగ్, సిబ్బంది దశరథ్, శ్వేత, ప్రవీణ, సురేష్, ఎల్లేశం సంపత్ మరియు స్థానిక మత్స్య పారిశ్రామిక సహకార సంఘం అధ్యక్షులు కొరుపల మహేం దర్ మరియు కామారెడ్డి జిల్లాలోని వివిధ మత్స్య పారిశ్రామిక సహకార సంఘం అధ్యక్షులు పాల్గొన్నారు పత్ మరియు స్థానిక మత్స్య పారిశ్రామిక సహకార సంఘం అధ్యక్షులు కొరుపల మహేందర్ మరియు కామారెడ్డి జిల్లాలోని వివిధ మత్స్య పారిశ్రామిక సహకార సంఘం అధ్యక్షులు పాల్గొన్నారు.

# జాతర ఉత్సవాలకు ముస్తాబైన నల్ల పోచమ్మ ఆలయం

## - నేడు నాగిరెడ్డి పేటలో నల్ల పోచమ్మ జాతర

**సూర్య, నాగిరెడ్డిపేట్**



ఉగాది పర్వదినం సందర్భంగా నాగిరెడ్డిపేట్ మండల కేంద్రంలోనీ నల్ల పోచమ్మ జాతర ఉత్సవాలు అత్యంత వైభవంగా జరగనున్నాయి, జాతర ఉత్సవాల సందర్భంగా అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి 3 రోజుల పాటు జాతర ఉత్సవాలు జరగనున్నాయి. ఈ ఉత్సవాలలో, నాగిరెడ్డిపేట్, లింగంపేట్, ఎల్లారెడ్డి, మండలాలతో పాటు మెదక్ జిల్లా ఇతర ప్రాంతాలకు చెందిన వివిధ మండలాల భక్తులు భారీ సంఖ్యలో హాజరై అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక ప్రార్థనలు చేసి తమ మొక్కులను తీర్చుకుంటారు. ఈనెల 30 న, ఎడ్ల బండ్ల ప్రదర్శన, 31 న, బోనాలు, ఏప్రిల్ 1న, రథోత్సవం కన్నుల పండుగగా నిర్వహిస్తామని గ్రామస్తులు తెలిపారు, ఎలాంటి అవాంఛన్య సంఘటనలు జరగకుండా, ఎల్లారెడ్డి డి.ఎస్.పి. శ్రీనివాసరావు, సీఐ రవీందర్ నాయక్,స్థానిక ఎస్సై మల్లారెడ్డి, ఆధ్వర్యంలో పోలీస్ భారీ బందోబస్తు నిర్వహించనున్నారు.



# లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ చేసిన -అర్బన్ ఎమ్మెల్యే

**సూర్య నిజామాబాద్ జిల్లా ప్రతినిధి**



నిజామాబాద్ అర్బన్ నియోజక వర్గం పరిధిలో అనారోగ్యంతో బాధపడుతూ వివిధ ఆసుపత్రులలో చికిత్స పొందిన పలువురు పేదలకు ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా మంజురైన ఆర్థిక సహాయాన్ని(చెక్కులు) అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ శనివారం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో 130 మంది లబ్ధిదారులకు పంపిణీ చేశారు. అనంతరం ధన్ పాల్ మాట్లాడుతు తెలంగాణలో రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఏర్పాటైన తరువాత తన కార్యాలయంలో దరఖాస్తు చేసుకున్న వారిలో 130 మందికి, రూ.32,36,500/- రూపాయల చెక్కులు వచ్చాయన్నారు. ఎలాంటి పైరవీలు లేకుండా దరఖాస్తు చేసుకునే వారు నేరుగా ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో అన్ని పత్రాలు అందజేస్తే సాధ్యమైనంత వరకు ప్రభుత్వం నుంచి, ముఖ్య మంత్రి సహాయ నిధి సాయం అందేలా తన వంతు ప్రయత్నం చేస్తానన్నారు. వేలాది మంది పేద, మధ్య తరగతి ప్రజలకు ఏటా సీఎం సహాయ నిధి ద్వారా ఆర్థిక చేయూతనందించడం జరుగుతుందని తెలిపారు. నియోజకవర్గంలో వందలాది మంది పేదలకు వైద్య సేవల కోసం సీఎం సహాయనిధి ద్వారా చెక్కులు అందించినట్లు చెప్పారు. లబ్దిదారులకు భారం కాకుండా చెక్కుల జారీ విషయంలో జాప్యం జరగకుండా అప్లై చేసుసుకున్న నెలలోపు వచ్చేల ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని అలాగే అప్లై చేసుకున్న మొత్తంలో 50% విడుదల చేయాలని డిమాండ్ చేసారు.ఈ కార్యక్రమంలో బిజెపి కార్పొరేటర్లు, మండల అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# జాగృతి అధ్యక్షురాలు కవితను కలిసిన లింగంపేట్ మాజీ ఎంపీపీ

**సూర్య,లింగంపేట్**



జాగృతి వ్యవస్థాపకురాలు కల్వకుంట్ల కవితను,ఎల్లారెడ్డి మాజీ ఎమ్మెల్యే సురేందర్ ను లింగంపేట్ మాజీ ఎంపీపీ ముదాం సాయిలు మర్యాద పూర్వకముగా కలిశారు. శనివారం రామారెడ్డి కాలభైరవి స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి హైదరాబాద్ వెళుతున్న ఆమెను బైపాస్ లో మాజీ ఎంపీపీ మూదాం సాయిలు బిఆర్ఎస్ నాయకులు పుష్ప గుచ్చం అందజేసారు.వీరి వెంట లింగంపేట్ బిఆర్ఎస్ మండల అధ్యక్షుడు దివిటి రమేష్,బిఆర్ఎస్ నాయకులు గన్ను నాయక్,రూప్ సింగ్,కాముని శ్రీనివాస్,తదితరులు ఉన్నారు.

# డంపింగ్ యార్డ్ లో భారీ అగ్ని ప్రమాదం

**సూర్య - మోపాల్**



నిజామాబాద్ నగర శివారు లోని నగారం లోని డంపింగ్ యార్డ్ లో భారీ అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. శుక్రవారం రాత్రి యార్డులో మంటలు అంటుకున్నట్లు సమాచారం. సుమారు 18 నుంచి 20 ఎకరాల విస్తీర్ణములో ఉన్న డంపింగ్ యార్డ్ లో మూడెకరాల వరకు తాగులబడినట్లు తెలుస్తుంది. సమాచారం అందుకున్న ఫైర్ స్టేషన్ సిబ్బంది రెండు ఫైర్ ఇంజనలతో శనివారం తెల్లవారి జామున వరకు మంటలు అర్పివేశారు.

## బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అమలు చేయాలి

## కామారెడ్డి రౌండ్ టేబుల్ సమావేశంలో ఎమ్మెల్సీ కవిత డిమాండ్

**సూర్య కామారెడ్డి జిల్లా ప్రతినిధి**




కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ ప్రకారం బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అమలు చేయాల్సిందేనని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు. కామారెడ్డి జిల్లా కేంద్రంలో టిఆర్ఎస్ పార్టీ నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశం స్థానిక శుభం కన్వెన్షన్ హాల్లో ఈ సమావేశం జరిగింది రౌండ్ టేబుల్ సమావేశం సందర్భంగా ఆమె మాట్లాడారు. గత బీహార్ ఎస్ ఐ యాం లో పదేళ్లలో రాష్ట్రం సంక్షేమ బడ్జెట్ రూపాయలు రెండు2.86 లక్షల కోట్లు ఉంటే అందులో 70% దాదాపు రూపాయలు1.55 లక్షల కోట్లు బీసీలకు కేటాయించిందన్నారు. కులవృత్తులను బలోపేతం చేసేందుకే ఈ రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహిస్తున్నట్లు ఆమె తెలిపారు. బీసీలకు ఎట్టి పరిస్థితుల్లో 42 శాతం రిజర్వేషన్ కల్పించాల్సిందేనని ఈ సందర్భంగా ఆమె డిమాండ్ చేశారు. ఇచ్చిన మాట తప్పకుండా కాంగ్రెస్ పార్టీ మాట నిలబెట్టుకోవాలని ఆమె అన్నారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యేలు గంప గోవర్ధన్ ఎల్లారెడ్డి మాజీ శాసనసభ్యులు నల్లమడుగు సురేందర్ మాజీ శాసనసభ్యులు జనార్ధన్ గౌడ్ మాజీ టీఎస్పీఎస్సీ సభ్యురాలు సుమిత్రానంద్ జిల్లా టిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు ముసిబుద్దిన్ పట్టణ అధ్యక్షులు జూకంటి ప్రభాకర్ రెడ్డి ఇతర పార్టీ నాయకులు తదితరులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

# జాగృతి అధ్యక్షురాలు కవితను కలిసిన లింగంపేట్ బిఆర్ఎస్ అధ్యక్షుడు రమేష్

**సూర్య,లింగంపేట్**



జాగృతి వ్యవస్థాపకురాలు కల్వకుంట్ల కవితను లింగంపేట్ బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు దివిటి రమేష్ మర్యాద పూర్వకముగా కలిశారు. శనివారం రామారెడ్డి కాలభైరవి స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేసిన ఆమెను బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు దివిటి రమేష్ నాయకులు కలిసి పుష్ప గుచ్చం అందజేసారు. నియోజకవర్గంలో బిఆర్ఎస్ పార్టీ బలంగా ఉందని రాబోయే రోజుల్లో నియోజకవర్గంలో బిఆర్ఎస్ జండా ఎగరవేస్తామన్నారు.వీరి వెంట మాజీ ఎంపీ ముదాం సాయిలు,బిఆర్ఎస్ నాయకులు గన్ను నాయక్,కాముని శ్రీనివాస్,టిఆర్ఎస్ నాయకులు కార్యకర్తలు ఉన్నారు.

# సి హెచ్ సి సేవలను వినియోగించుకోవాలి

## - డిప్యూటీ డిఎంహెచ్ఓ తుకారం రాథోడ్

**సూర్య- నవీపేట్**

మండల కేంద్రంలోని క్లస్టర్ హెల్త్ సెంటర్ లో మండల ప్రజలు వైద్య సేవలు వినియోగించుకోవాలని డిప్యూటీ డిఎంహెచ్ఓ, తుకారం రాథోడ్ సూచించారు. ఆసుపత్రి డెవలప్మెంట్ కమిటీ సమావేశాన్ని ఎంపీడీవో నాగనాథ్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా తుకారం రాథోడ్ మాట్లాడుతూ. ఆసుపత్రి సూపరిండెంట్ బల్వీర్ సింగ్ శ్వాసకోశ వ్యాధుల ప్రత్యేక నిపుణులని వారానికి రెండు రోజులు శని, సోమవారం అందుబాటులో ఉంటారు కాబట్టి మండల ప్రజలు ఆయన సేవలను వినియోగించుకోవాలని కోరారు. ఆసుపత్రిలో సాధారణ డెలివరీలు ఎక్కువగా అయ్యేలా చూడాలని రోగులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చూడాలని సూచించారు.



ఆసుపత్రి అభివృద్ధికి 2 లక్షల 25 వేలు బడ్జెట్ మంజూరు కాగా సుమారు 3 లక్షల వరకు అవసరాలు ఉన్నందున మొదట ప్రధానమైన అవసరాలకు బడ్జెట్ ను వాడడం జరుగుతుందని అన్నారు. ఆసుపత్రిలో త్రాగునీరు, విద్యుత్తు, ఫ్యాన్లు మరియు కంప్యూటర్ తదితర సామాగ్రి మరమ్మత్తులు చేయడం జరుగుతుందని అన్నారు. సిబ్బంది కొరత విషయమై ఉన్నత అధికారుల దృష్టికి తీసుకువెళ్తానని అన్నారు. బినోల ప్రైమరీ హెల్త్ సెంటర్ కు 62 వేల రూపాయలు మంజూరు అయ్యాయని వాటిని అవసరాలకు వినియోగించేందుకు ఆమోదించినట్లు తెలిపారు. ఆసుపత్రిలో కుక్కపాము కాటుతోపాటు కోతి గాయపరిచిన మందులు అందుబాటులో ఉన్నాయని అన్నారు. వేసవి దృష్ట్యా ప్రజలు మధ్యాహ్నం ఒంటి గంట కంటే ముందే పనులు పూర్తి చేసుకోవాలని అవసరానికి సరిపడా ఓఆర్ఎస్ గ్రామాలలో సిద్ధంగా ఉందని అన్నారు. గ్రామాలలో దోమల నివారణకు గ్రామ అభివృద్ధి కమిటీ వారు కృషి చేయాలని సూచించారు. అలాగే ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గిస్తే అనేక రోగాలు దూరం అవుతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ వెంకటరమణ, వైద్యులు నవ్య, కావ్య, కిషన్, వెంకటేశ్వర్లు, ఐకెపి మండల అధ్యక్షురాలు ఉషారాణి మరియు ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

# విగ్రహాన్ని ధ్వంసం చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలి

**సూర్య మోర్తాడ్**

రాజ్యాంగ నిర్మాత ప్రపంచ మేధావి అయిన డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహాన్ని ధ్వంసం చేసిన నిందితులను వెంటనే పట్టుకుని కఠినంగా శిక్షించాలని డిఎస్ఎస్ మండల అధ్యక్షులు ఏం. రాజారాం డిమాండ్ చేశారు. మోర్తాడ్ మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశం లో రాజారాం మాట్లాడారు. కొడపాక మండలం దమ్మక్క పల్లి గ్రామంలో గురువారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు అంబేద్కర్ విగ్రహాన్ని ధ్వంసం చేశారని తెలిపారు. కొందరు కావాలని ఇలాంటి దుశ్చర్యలకు పాల్పడుతున్నారన్నారు. ఇలా విగ్రహాలను ధ్వంసం చేస్తూ రాష్ట్రంలో అలజడి సృష్టిస్తున్న వారు ఎంతటి వారైనా వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు.



ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో ఏదో ఒక చోట విగ్రహాలు ధ్వంసం చేయడం పరిపాటిగా మారిందని ఇది దురదృష్టకరమన్నారు. ఇలాంటి సంఘటనలకు పాల్పడుతున్న వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకుంటే, మరోసారి ఇలాంటి సంఘటనలు పునరావృతం కావన్నారు. చట్టాల్లో ఉన్న లోపాలను ఆసరాగా చేసుకుని నిందితులు విగ్రహాల ద్వంసాలకు పాల్పడటం చూస్తే మన సమాజం ఎటువైపు వెళుతుందని ప్రశ్నించారు. చదువుకున్న చదువులు, నేర్చుకున్న జ్ఞానం నిద్ర వ్యవస్థలోకి పోయి మూరు?ళ్ల వ్యవహరించడం బాధాకరమన్నారు. ఏదో ఒక రోజు ఇలాంటి సంఘటనలకు పాల్పడుతున్న నిందితులకు గుణపాఠం చెప్పే సమయం అతి దగ్గరలోనే ఉందని రాజారాం వెల్లడించారు. ఇకనైనా ఉన్నతాధికారులు స్పందించి విగ్రహాల ధ్వంసం వెనక కుట్రకోణం ఏదైనా ఉందా అనే విషయంపై పూర్తి సమగ్ర విచారణ జరిపి నిందితులకు కఠిన శిక్ష పడేలా కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం ఉపాధ్యక్షులు ఎం. గంగాధర్, ప్రధాన కార్యదర్శి జాంబవ చాంబర్, ప్రధాన సలహాదారు అడ్వకేట్ ఎం. రాజేశ్వర్, పాలెం గ్రామ మాజీ సర్పంచ్ బాబన్నలు పాల్గొన్నారు.

# గొడవలకు తావివ్వకుండా జాతర ఉత్సవాలు నిర్వహించాలి

## -సిఐ రవీందర్ నాయక్



**సూర్య,లింగంపేట్**

ఎలాంటి గొడవలకు తావివ్వకుండా ప్రశాంత వాతావరణంలో మత్తడి పోచమ్మ జాతర ఉత్సవాలు నిర్వహించాలని ఎల్లారెడ్డి సిఐ రవీందర్ నాయక్ మత్తడి పోచమ్మ ఆలయ కమిటీ సభ్యులకు సూచించారు.ఆయన శనివారం లింగంపేట్ మండల సమీపంలోని మత్తడి పోచమ్మ ఆలయ పరిసరాలను బందోబస్తు నిమిత్తం పరిశీలించారు.మత్తడి పోచమ్మ జాతరకు ఏర్పాట్లు పూర్తి చేయడం జరిగిందని ఆలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షులు దూరిశెట్టి అశోక్ తెలిపారు.ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని నేటి నుండి వారం రోజులపాటు జాతర ఉత్సవాలు జరుగుతాయన్నారు.ఉగాది పర్వదినాన అమ్మవారి వద్ద ఎడ్లబండ్ల ప్రదర్శన నిర్వహించడం జరుగుతుందన్నారు.మంగళవారం అమ్మవారి ఊరేగింపు బుధవారం ఉదయం రథోత్సవం మధ్యాహ్నం కుస్తీ పోటీలను నిర్వహించడం జరుగుతుందన్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా తాగునీటి సౌకర్యం ఏర్పాటు చేశామన్నారు ఆలయం చుట్టు పరిసర ప్రాంతాల్లో విద్యుత్ దీపాలను ఏర్పాటు చేశారు. వీరి వెంట లింగంపేట్ రెవిన్యూ ఇన్స్పెక్టర్ కిరణ్, ముదిరాజ్ నాయకులు బొల్లారం క్రాంతి కుమార్, నగేష్,ఆలయ కమిటీ సభ్యులు మారుతి, గ్రామస్తులు కిరణ్ తదితరులు ఉన్నారు.

# నేడు ఎమ్మెల్యే మదన్ మోహన్ గారి ఆధ్వర్యంలో ఉస్మానియా మజీద్ లో ఇఫ్తార్ విందు

## -మండల పట్టణ అధ్యక్షులు కురుమ సాయిబాబా పాటకుల వినోద్ గౌడ్

**సూర్య ఎల్లారెడ్డి**



నేడు ఎల్లారెడ్డి నియోజకవర్గంలో ఎల్లారెడ్డి శాసనసభ్యులు మదన్మోహన్రావు పలు మండలాల్లో పర్యటిస్తారని మండల, పట్టణ అధ్యక్షులు కురుమ సాయిబాబా, పాఠకుల వినోద్ గౌడ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు వారి ఇరువురు మాట్లాడుతూ ఆదివారం 12:00 గం.లకు రామారెడ్డి మండల కేంద్రంలో గల కాలభైరవ స్వామి దేవాలయం లో ప్రత్యేక పూజలు చేస్తారని అనంతరం ఎల్లారెడ్డి క చేరుకొని సాయింత్రం: 5:00 ఎల్లారెడ్డి మండల కేంద్రంలో గల ఉస్మానియా మస్జీద్ నందు ఇఫ్తార్ విందు వేడుకలు లో పాల్గొని మైనారిటీ నాయకులతో  విందు ను ఆరగిస్తారని తెలిపారు ఈ కార్యక్రమానికి పెద్ద ఎత్తున మైనార్టీ సోదరులు , కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని వారు కోరారు.

# రోడ్డు ప్రమాదంలో పలువురికి గాయాలు

**సూర్య వేల్పూర్**

వేల్పూర్ మండల కేంద్రం నుండి ఆర్మూర్ వైపు కొంతమంది వ్యక్తులతో వెళుతున్న ఆటోను అమీనాపూర్ సాయిబాబా గుడి వద్ద ఆర్మూర్ నుండి భీంగల్ వైపు వెళ్తున్న హార్వెస్టర్ ఆటోను ఢీ కొట్టడంతో పలువురికి తీవ్ర గాయాలు అయినట్లు ఎస్సై సంజీవ్ తెలిపారు. బాధితుల వివరాలు తెలియవలసి ఉందని అన్నారు.

# పేకాట రాయుళ్ల అరెస్ట్

**సూర్య మాక్లూర్**



మండలంలోని అమ్రాద్ గ్రామ శివారులో పేకాట స్థావరంపై టాస్క్ ఫోర్స్ పోలీసులు దాడి చేసి 8 మంది పేకాట రాయుళ్లను అరెస్ట్ చేశారు.పేకాట రాయుళ్ల వద్ద నుండి 7740 నగదు,6 ద్విచక్ర వాహనాలు,8 సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు.మాక్లూర్ ఠాణాలో పేకాట రాయుళ్లను అప్పగిం చగా వారిపై కేసులు నమోదు చేసినట్లు ఇంచార్జి ఎస్ఐ లక్ష్మయ్య తెలిపారు.

# ఇన్విజిలేటర్ లను విధుల నుండి తొలగించాలి

**సూర్య- బిక్కనూర్**



మండల కేంద్రంలోని స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రూమ్ నెంబర్ 4 లో పదో తరగతి పరీక్షలో భాగంగా శనివారం నిర్వహించిన బయో సైన్స్ పరీక్ష పూర్తి కాకముందే 15 నిమిషాల ముందు విద్యార్థుల నుండి పరీక్ష పేపర్లను లాక్కున్న ఇన్విజిలేటర్ లను వెంటనే విధుల నుండి తొలగించాలని టీజీవీపీ జిల్లా అధ్యక్షుడు గంధం సంజయ్ డిమాండ్ చేశారు. విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతున్న ఇన్విజిలేటర్ లను తొలగించకుంటే మండల విద్యా వనరుల అధికారి కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. వెంటనే జిల్లా విద్యాధికారి వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ఇన్చార్జ్  సమీర్, నరేందర్ పాల్గొన్నారు.

# సీతారాముల కళ్యాణానికి సర్వం సిద్ధం

**సూర్య వేల్పూర్**



వేల్పూర్ మండలం పడగల గ్రామంలో గ్రామ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో శ్రీ సీతారాముల కల్యాణానికి ఏర్పాట్లు ముమ్మరంగా జరుగుతున్నాయి. నేటి నుంచి ప్రారంభం అయ్యే ఉత్సవాలకు దేవాలయాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్ది కార్యక్రమాలను చేయనున్నట్లు గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు తెలిపారు. ఉగాది నుండి ఏడవ తేదీ వరకు శ్రీ సీతారాముల కళ్యాణం సంబరాలు నిర్వహించడం జరుగుతుందని ఒక్కో రోజు ఒక్కో కార్యక్రమాలు నిర్వహించి కన్నుల పండుగగా స్వామివారి కళ్యాణ ఉత్సవం నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఉగాది నుండి గ్రామంలోని ఉత్సవ విగ్రహాల చే శావా ప్రతి ఇంటింటికి తిరిగి అందరికీ దర్శన భాగ్యం అయ్యేలా ఏర్పాటు చేశామని తెలిపారు. ఇట్టి కార్యక్రమానికి గ్రామస్తులు పాల్గొని విజయవంతం చేయవలసిందిగా కోరారు. జాతర ఉత్సవాల యొక్క కరపత్రాలను గ్రామాభివృద్ధి కమిటీ అధ్యక్షులు జక్కల రాజేశ్వర్, పాక్ పాట్ల గంగారెడ్డి, మాతపు సాయన్న, మాడవీడి గంగ కిషన్, చెండి రాములు, జాతర కార్యక్రమాల యొక్క సరళి విడుదల చేశారు.

# సమాచార హక్కు చట్టం కింద దరఖాస్తు

**సూర్య మోర్తాడ్**

మండల కేంద్రంలోని తహసిల్దార్ కార్యాలయంలో సమాచార హక్కు చట్టం క్రింద ఇదే గ్రామానికి చెందిన సామాజిక కార్యకర్త మనోజ్ శనివారం దరఖాస్తు ఇచ్చినట్లు ఒక ప్రకటనలో తెలియజేశారు. వివరాల్లోకి వెళితే తహసిల్దార్ కార్యాలయంలో రెగ్యులర్ ఉద్యోగస్తులు ఎంతమంది పనిచేస్తున్నారని, కాంట్రాక్టు పద్ధతిలో పనిచేసే వారు ఎంతమంది అనే సమాచారం అందించాలని కోరారు. అంతేకాకుండా మోర్తాడ్ ముసలమ్మ చెరువు కబ్జాకు గురి అయ్యిందనే సమాచారం మేరకు చెరువు విస్తీర్ణం తోపాటు పూర్తి వివరాలు ఇవ్వాలని ప్రకటనలో కోరారు. తహసిల్దార్ కార్యాలయంలో కుల ధ్రువీకరణ పత్రం, ఆదాయ ధ్రువీకరణ పత్రం తో పాటు వివిధ సర్టిఫికెట్ల కోసం సంబంధిత బాధితులు కార్యాలయానికి వచ్చినప్పుడు దరఖాస్తుదారులకు కార్యాలయ సిబ్బంది నిర్లక్ష్యంగా మాట్లాడుతూ హేళన చేస్తున్నారని పేర్కొన్నారు. సర్టిఫికెట్స్ జారీలో జాప్యం చేస్తూ, బాధ్యత రహితంగా మాట్లాడుతున్నారని, ప్రకటనలో ఆందోళన వ్యక్తం చేశారు. పూర్తి వివరాలు ఇవ్వాలని తహసిల్దార్ కార్యాలయంలో దరఖాస్తు చేసినట్లు మనోజ్ ప్రకటనలో స్పష్టం చేశారు.

# రేషన్ కార్డుల సర్వేలో కార్యదర్శులకు మినయించాలి

## -ఎంపీడీవోకు కార్యదర్శుల వినతి

**సూర్య,లింగంపేట్**



గ్రామపంచాయతీ కార్యదర్శులను రేషన్ కార్డుల సర్వే నుంచి మినహాయింపు ఇవ్వాలని శనివారం ఎంపీడీవో నరేష్ కు లింగంపేట్ మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన కార్యదర్శులు వినతి పత్రం అందజేశారు.ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శుల మండల అధ్యక్షుడు అశ్వక్ మాట్లాడుతూ ఇప్పటికే గ్రామ పంచాయతి కార్యదర్శులకు ఇంటి పన్నుల వసూలు, ఎల్ఆర్ఎస్,వేసవి కాలంలో నీటి ఎద్దడి,పారిశుద్ధ్య పనులు,ఇందిరమ్మ ఇల్లు రెండో విడత సర్వే 1,2 ఎల్  సమర్పించడం జరుగుతుందన్నారు.ఉపాధి హామీ పనుల పర్యవేక్షణ,నర్సరీలు పర్యవేక్షణ సాధారణ ధృవపత్రాలు అందజేత తదితర పనులు ఇప్పటికే కార్యదర్శులకు తీవ్ర ఒత్తిడికి లోనవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.రేషన్ కార్డులో సర్వే నుంచి కార్యదర్శులకు మినాయింపు ఇవ్వాలని వాళ్లు ఎంపీడీవోకి ఇచ్చిన వినతి పత్రంలో పేర్కొన్నారు.జిల్లా ఉన్నత అధికారులకు నివేదిక అందిస్తానని ఎంపీడీవో అన్నారు.ఈ కార్యక్రమంలో మండలంలో వివిధ గ్రామాల పంచాయతీ కార్యదర్శిలు పాల్గొన్నారు.

## రాజీవ్ యువ వికాసం ద్వారా

# నిరుద్యోగ యువతకు మంచి ఉపాధిచేకూరుస్తున్న ఎమ్మెల్యే మదన్మోహన్ రావు

### - ఎల్లారెడ్డి సొసైటీ వైస్ చైర్మన్ మత్తమాల ప్రశాంత్ గౌడ్

**సూర్య ఎల్లారెడ్డి**

రాజీవ్ యువ వికాసం పథకం ద్వారా నిరుద్యోగ యువతకు మంచి ఉపాధి లభిస్తుందని ఎల్లారెడ్డి సొసైటీ ఉపాధ్యక్షుడు మత్తమాల ప్రశాంత్ గౌడ్ అన్నారు.శనివారం ఆయన సూర్య మేజర్ న్యూస్ తో మాట్లాడుతూ రాజీవ్ యువ వికాసం స్వయం ఉపాధి ద్వారా చాల మంది నిరుద్యోగ యువతకు ఆర్థిక లబ్ధి చేకూరుస్తున్న ఎమ్మెల్యే మదన్ మోహన్ రావుకు నిరుద్యోగ యువత రుణపడి ఉన్నట్లు ఆయన అభివర్ణించారు ఎస్సీ, ఎస్టి, బిసి, మైనార్టీ నిరుద్యోగ యువత కు వచ్చే నెల 5 వ తారీఖు (ఏప్రిల్ 05) లోపు ఆన్లైన్ ద్వారా అప్లై చేసుకోవాలని ఈ సందర్భంగా ఆయన తెలియజేశారు. ఎమ్మెల్యే మదన్మోహన్ అర్హులైన ప్రతి ఒక్క లబ్ధిదారునికి న్యాయం చేకూరుస్తారన్నారు.తెలంగాణ ప్రభుత్వ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం నిరుద్యోగ యువతను ప్రోత్సహించేందు కు "రాజీవ్ యువ వికాసం" పేరుతో కొత్త పథకం ప్రారంభించిందన్నారు జూన్ 02 వ తారీఖున తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం న లబ్ధిదారులను ప్రకటిస్తారన్నారు. 60% నుండి 80% శాతం వరకు రాయితీ ఉంటుందని ఒక్కో లబ్ధిదారునికి రూ.50 వేల నుండి రూ. 4 లక్షల వరకు మంజూరు అవుతుందన్నారు కావున దీన్ని దృష్టిలో ఉంచుకొని ఎస్సీ, ఎస్టి, బిసి, మైనార్టీ నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎల్లారెడ్డి సొసైటి చైర్మన్ మత్తా మాల ప్రశాంత్ గౌడ్ ఈ సందర్భంగా తెలియజేశారు.



# ఈ వేసవి సందర్భంగా వడదెబ్బ తగలకుండా పలు జాగ్రత్తలు పాటించాలి

### - డాక్టర్ సూపర్డెంట్ రవీంధ్ర మోహన్

**సూర్య ఎల్లారెడ్డి**




ఎల్లాడి పట్టణ కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రి సూపర్డెంట్ డాక్టర్ రవీంద్ర మోహన్ తో సూర్య మేజర్ న్యూస్ శనివారం చరవాణిలో పలకరించింది వేసవిలో వడ దెబ్బ తగలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను డాక్టర్ రవీంద్ర మోహన్ తన సలహాలు సూచనలు తెలియజేశారు ప్రభుత్వ వైద్యులు సూపర్డెంట్ డాక్టర్ రవీంద్ర మోహన్ మాట్లాడుతూ ఈ క్రింది లక్షణాల వలన తెలుసుకోవచ్చు.అని అన్నారు ఎండ వేడిమి లో తిరిగేవారికి కండరాల తిమ్మిరి భారీ చెమట పట్టడం విపరీతమైన బలహీనత తలనొప్పి వాంతి అధిక హృదయ స్పందన ముదురు రంగు మూత్రం పాలిపోయిన చర్మం వడదెబ్బ తగిలినపుడ్డు

**పై లక్షణాల్లో దేనినైనా మీరు అనుమానించినట్లయితే, తక్షణ కార్యాచరణ ప్రణాళికను అనుసరించండి:**

రోగిని నీడలో, చల్లగా ఉండే ప్రదేశానికి తరలించండి, ప్రాధాన్యతగా గందరగోళాన్ని తగ్గించటం కొరకు ఏదైనా అదనపు దుస్తులను తొలగించండి. రోగి చుట్టూ గుంపులు గుంపులుగా ఉండకూడదు, ఒక వ్యక్తి రోగికి సహాయం కావచ్చు. చల్లని షవర్, చల్లని నీటితో స్పాంజ్, ఐస్ ప్యాక్ లు లేదా నుదురు, మెడ, శరీరాన్ని తడి టవల్ తో తుడవండి.

వడదెబ్బను నివారించడానికి 12 వేసవి చిట్కాలు పాటించాలని కోరారు వదులుగా ఉండే, తేలికపాటి, లేత రంగు దుస్తులను ధరించండి.

చల్లని ద్రవాలు త్రాగండి నిర్జలీకరణానికి గురికాకుండా నిరోధించండి.

ఆల్కహాల్ మిమ్మల్ని త్వరగా డీహైడ్రేట్ చేస్తుంది, దానిని నివారించవచ్చు.

దోసకాయ, పుచ్చకాయలు, దానిమ్మ , అరటిపండు వంటి పండ్లను ఆస్వాదించండి. వేడి వాతావరణంలో, తీవ్రమైన కార్యకలాపాల్లో పాల్గొనవద్దు. తేలికపాటి వ్యాయామాలు ఈత కొట్టడంలో పాల్గొనండి.

ఆరుబయట ఉంటే, నీడలో క్రమం తప్పకుండా విశ్రాంతి తీసుకోండి తరచుగా ద్రవాలు త్రాగండి. ఫ్యాన్లు సహాయపడగలవు కానీ పొడిగించిన వేడి వాతావరణంలో, ఉష్ణోగ్రత తేమను తగ్గించటానికి ఎయిర్ కండిషనింగ్ ఉత్తమ మార్గం.అని అన్నారు పూర్తి కవరింగ్ ఇంకా వదులుగా ఉండే దుస్తులు, టోపీ, సన్ గ్లాసెస్ మరియు సన్ స్క్రీన్ సన్ బర్న్ నుంచి మిమ్మల్ని మీరు సంరక్షించుకోండి. బిడ్డను (ఏ వ్యక్తినైనా) 5 నుంచి 10 నిమిషాల కంటే ఎక్కువ సేపు కారులో విడిచిపెట్టవద్దు.ఒకవేళ మీకు వడదెబ్బ వచ్చే ప్రమాదం ఎక్కువగా ఉన్నట్లయితే, అవసరమైన అన్ని జాగ్రత్తలు తీసుకోండి మరియు దగ్గరల్లో తక్షణ వైద్య సేవలు పొందండి . ఉపవాసం ఆరోగ్యానికి నూతన మార్గం ప్రయోజనాలు, పద్ధతులు మరియు జాగ్రత్తలు తీసుకోవడంలో తల్లిదండ్రులు ముఖ్య పాత్ర పోషించాలి మధురమైన గర్భధారణకు ప్రణాళిక , సన్నాహాల వేసవిలో అలర్జీల బాధ, కారణాలు, లక్షణాలు, ఉపశమన మార్గాలు డీహైడ్రేషన్ ( లక్షణాలు, కారణాలు, చికిత్సలు అండ్ నివారణ వేసవి తాపం: వడదెబ్బ, వేసవి అలసట తట్టుకోలేని పరిస్థితిలో పుచ్చకాయ, వాటర్ మిలన్, నిమ్మకాయ లను తీసుకోవాలి వడదెబ్బ కొట్టకుండా ముందు జాగ్రత్తగా లక్షణాలు, కారణాలపై తీసుకోవలసిన జాగ్రత్తల పై అవగాహన ఉండాలి అత్యవసర పరిస్థితిని ఎదురైతే వెంటనే ఆసుపత్రికి తరలించాలి అని అన్నారు.

# రసాభాసగా మహాజన సభ

**సూర్య మాక్లూర్**

మాక్లూర్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘ చైర్మెన్ బురోళ్ల అశోక్ అధ్యక్షతన శనివారం నిర్వహించిన 86 వ,మహాజన సభ రసాభాసగా కొనసాగించింది.సంఘంలో సుమారు కొన్ని లక్షల అవకతవకలకు గత చైర్మెన్, పాలక మండలి సభ్యులు అవినీతికి పాల్పడ్డారని పరపతి సంఘ రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు.ఈ నేపథ్యంలో సంఘా కార్యవర్గ సభ్యులకు,రైతులకు కొంత సేపు వాగ్వాదం నెలకొంది.కొన్ని లక్షల





నిధులు దుర్వినియోగం జరిగిన అప్పటి డిసిఓ సింహాచలం ఎలాంటి రికవరీ చేయలేదన్నారు. రైతులు అప్పట్లోనే ఎల్ టి లోన్ లు చెల్లిస్తే సహకార సంఘ రసీదులు ఇచ్చి నగదును మాత్రం సంఘంలో జమా చేయలేదన్నారు. ప్రస్తుతం యసంగి ధాన్యం వచ్చే నెల ఒకటో తారీకు నుంచి కొనుగోలు చేయడానికి సభ్యులం దరూ తీర్మానం చేశారు. దుర్వినియో గమైన నిధులు రికవరీ చేయాలని సంఘ సభ్యులు, సహకార సిబ్బందిపై ఒత్తిడి తెచ్చారు.ఈ విషయాన్ని డిసిఓ వద్దకు తీసుకువెళ్తామని ఆయన ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటా మని పీఏసిఎస్ చైర్మెన్ బురోళ్ల అశోక్ తెలిపారు .బొంకన్ పల్లి,మాదాపూర్ గ్రామాలలో గోదాములు కట్టనప్పటికీ కట్టినట్టు బిల్లులు లేపడంతో గ్రామాల రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు.త్వరలో తమ గ్రామాలలో గోదాములు పూర్తి చేస్తామని చైర్మెన్ హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీ చైర్మన్ విఠల్ రావు,సొసైటీ వైస్ చైర్మన్ గుండారం శేఖర్, డైరెక్టర్లు గంగోని గంగాధర్, చిన్నయ, రమేష్, ప్రసాద్,అశోక్,అజ్జ నాయక్,మాజీ చైర్మెన్ భాస్కర్ రావు,అసిస్టెంట్ రిజిస్టర్ స్వప్న,తదితరులు పాల్గొన్నారు.

## పభుత్వ భూమిని కబ్జా దారుల నుండి రక్షించండి సారు

### -ఎమ్మార్వోకు కోమట్పల్లి గ్రామస్తుల ఫిర్యాదు

**సూర్య లింగంపేట్**

కబ్జా దారుల నుండి ప్రభుత్వ భూమిని రక్షించండి సారు అని శనివారం కోమట్పల్లి గ్రామస్తులు తహసిల్దార్ సురేష్ కు వినతిపత్రం అందజేశారు. లింగంపేట మండలంలోని కోమటిపల్లి గ్రామ సమీపంలోని అల్లూరమ్మ సమీపంలో గల భూమిని కొందరు కబ్జా చేశారన్నారు.ఇప్పటికే గ్రామ పంచాయతీ పరిధిలో మినీ పార్క్,క్రీడా ప్రాంగణం ఏర్పాటు చేశామని ప్రతి ఏటా రైతులు ఖరీఫ్, యాసంగిలో ధాన్యం ఆరబెట్టు కునేందుకు లింగంపేట్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో భూమిని చదును చేసి ఐదు సంవత్సరాల నుండి రైతులు ధాన్యాన్ని ఆరబెట్టు తున్నామన్నారు.కావాలనే కోమటిపల్లి గ్రామానికి చెందిన ఒకరు దౌర్జన్యంగా భూమిని కబ్జా చేశారని వెంటనే సర్వే నిర్వహించి కబ్జా చేసిన వారిపై చర్య తీసుకోవాలని పేర్కొన్నారు.

## మూడు ఇసుక ట్రాక్టర్లు సీజ్

**సూర్య రాజంపేట**



రాజంపేట మండలం ఎల్లారెడ్డిపల్లి గ్రామ శివారులో అక్రమంగా ఇసుక తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను అటవీ శాఖ అధికారులు పట్టుకున్నారు. ఈ ట్రాక్టర్లు మెదక్ జిల్లాకు చెందినవిగా గుర్తించారు. అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తున్నట్టు సమాచారం అందుకున్న అధికారులు అక్కడికి చేరుకుని ట్రాక్టర్లను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం వాటిని రాజంపేట పోలీస్ స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేశారు.అధికారులు మాట్లాడుతూ, ఇసుక అక్రమ రవాణాపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రకృతి సంపదను దోచుకునే వారికి చట్ట ప్రకారం శిక్షలు అమలు చేస్తామని స్పష్టం చేశారు. ప్రజలు అక్రమ ఇసుక రవాణాపై సమాచారం అందించాలని కోరారు. ఆదికారులు అటవీ అధికారులు శ్రీనివాస్, సురేష్, పద్మరావు పాల్గొన్నారు.

## జంగంపల్లి లో సిసి రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం

**సూర్య- బిక్కనూర్**



మండలంలోని జంగంపల్లి గ్రామంలో ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలలో భాగంగా దేశ ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని ఉపాధి హామీ పథకం నిధుల ద్వారా చేపట్టిన సుమారు 10 లక్షల విలువైన సి సి రోడ్డు పనులను, బీజేపీ నాయకులు శనివారం కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా నాయకులు రాజశేఖర్ రెడ్డి,మండల అధ్యక్షులు ఉప్పరి రమేష్ మాట్లాడుతూ కేంద్ర కేంద్రంలో నరేంద్ర మోడీ నాయకత్వంలో గ్రామాల అభివృద్ధికి ఎన్ఆర్ఈజీఎస్ నిధులు కేటాయిస్తుందని, ఈ సందర్భంగా గ్రామ ప్రజల తరపున ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి అత్తెల్లి తిరుమలేశ్, గ్రామ అధ్యక్షులు కుమ్మరి నరేందర్, ప్రమీల, పావని, రాము ప్రవీణ్ గౌడ్ చంద్రం సాయి రాజ్ నగేష్ సంతోష్ వార్డు ప్రజలు పాల్గోన్నారు

## ఘనంగా టీడీపీ ఆవిర్భావ దినోత్సవం

**సూర్య బాల్కొండ**



ముప్కాల్ మండల కేంద్రంలో టీ డి పి ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా శనివారం రోజు ఉదయం మండల కేంద్రంలో తెలుగుదేశం పార్టీ గద్దె వద్ద పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ఆనాటి ముఖ్యమంత్రి ఎన్టీఆర్ చేసిన సేవలను గుర్తుచేశారు. తెలుగు రాష్ట్రాలకు ఎన్టీఆర్ లాంటి మహోన్నత వ్యక్తిత్వం ఉన్న నాయకులు ప్రస్తుత రాజకీయల్లో ఎవరులేరన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షులు డాక్టర్ రాములు, జనార్దన్, లక్ష్మీ రాజాం,లోక రాములు,సాగర్, అభినవ్ తదితరులు పాల్గొన్నారు.

## నవోదయ ప్రవేశ పరీక్షలో అర్హత పొందిన విద్యార్థులు 2న హాజరు కావాలి

**సూర్య నిజాంసాగర్**

నిజాంసాగర్ జవహర్ నవోదయ విద్యాలయంలో 2025 -26 సంవత్సరానికి గాను ఆరవ తరగతిలో ప్రవేశానికి ఎంపికైన విద్యార్థులు ఏప్రిల్ 2న నవోదయ విద్యాలయంలో హాజరు కావాలని ఇన్చార్జి ప్రిన్సిపాల్ జానకీరాములు శనివారం సాయంత్రం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ప్రవేశ పరీక్ష జనవరి 18 -2025 న జరిగింది. ఫలితాలను www.navodaya.gov.in లింకులో చూసుకోవాలన్నారు. ఎంపికైన విద్యార్థులు ఏప్రిల్ 2న సర్టిఫికెట్స్ తో ప్రిన్సిపాల్ ను సంప్రదించాలన్నారు.

## డంపింగ్ యార్డ్ లో భారీ అగ్ని ప్రమాదం

**సూర్య - మోపాల్**

నిజామాబాద్ నగర శివారు లోని నగారం లోని డంపింగ్ యార్డ్ లో భారీ అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. శుక్రవారం రాత్రి యార్డులో మంటలు అంటుకున్నట్లు సమాచారం. సుమారు 18 నుంచి 20 ఎకరాల విస్తీర్ణములో ఉన్న డంపింగ్ యార్డ్ లో మూడెకరాల వరకు తాగులబడినట్లు తెలుస్తుంది. సమాచారం అందుకున్న ఫైర్ స్టేషన్ సిబ్బంది రెండు ఫైర్ ఇంజనలతో శనివారం తెల్లవారి జామున వరకు మంటలు అర్పివేశారు.